క్లుప్తంగా

కిల్లిపోలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి ముర్రాటలు తీసుకెళ్తున్న మహిళలు

టెక్కలి రూరల్: స్థానిక చేరివీధిలోని కిల్లిపోలమ్మతల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవేటి మొదటి మంగళవారం కావడంతో వేకువజాము నుంచే చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. మహిళలు తమ ఇళ్ల వద్ద నుంచి బిందెలతో ముర్రాటలను తీసుకుని అమ్మవారికి చల్లదనం చేశారు.

పశుగ్రాసం పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి



పశుగ్రాస క్షేత్రాన్ని పరిశీలిస్తున్న పశువైద్య సిబ్బంది

టెక్కలి: పశుగ్రాసాల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని లింగాలవలస పశు వైద్యాధికారి ఎం.పూర్ణచంద్రరావు సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రంగాపురం గ్రామంలో పశు గ్రాస క్షేత్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పశు గ్రాసం వలన పశువులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే గ్రాసం పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వరలక్ష్మి, గిరిబాబు పాల్గొన్నారు.

వివేకానందుని బాటలో పయనిద్దాం



ర్యాలీ చేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు, విద్యార్థులు

టెక్కలి: విద్యార్థులంతా స్వామి వివేకానందుని బాటలో పయనించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం టెక్కలి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక గోపినాథపురం నుంచి పాత జాతీయ రహదారిలో గల వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.నరేంద్రచక్రవర్తి, విద్యార్థి సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు కె.మురళి, శ్యామ్, మదన్‌మోహన్, విశ్వనాగ, అరవింద్, సంతోష్, గంగారాం ఉన్నారు.

డిప్లమో ఫలితాల్లో ఆదిత్య విద్యార్థికి ప్రథమ స్థానం



శ్యామ్‌సుందర్‌ను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు

టెక్కలి: ఇటీవల విడుదలైన పాలిటెక్నికల్ డిప్లమో ఫలితాల్లో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బొడ్డేపు శ్యామ్‌సుందర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్లలో 4,500 మార్కులకు గాను 4,305 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. సోంపేట మండలం కొండపోలేరు గ్రామానికి చెందిన శ్యామ్ సుందర్ నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందినప్పటికీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారని, వారి శ్రమకు ఫలితంగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డిప్లమో డీడీ బి.శ్రీనివాసరావు అభినందించారు.

130 మందికి నేత్ర పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కాశీబుగ్గ: పలాస సత్యసాయి సేవా సమితి మందిరంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహించిన శిబిరంలో పలాస నేత్రవైద్యాధికారి రోణంకి వెంకటరమణ సమక్షంలో 130 మందికి వేద్య పరీక్షలు చేశారు. వీరిలో 70 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సేవా సంస్థ కన్వీనర్ డోకి జగదీశ్వరరావు, సేవాదల్ కో–ఆర్డినేటర్ పొట్నూరు శ్రీనివాసరావు, కామేశ్వరరావు, కృష్ణస్వామి, సునీత, ఉషారాణి ఉన్నారు.

అటు శిథిలం.. ఇటు నిరుపయోగం!

- భయాందోళనలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు సిబ్బందిని భయాందోళనకు గురి చేస్తున్నాయి. సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఇచ్ఛాపురం మండల పరిషత్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అయినా ఇదే భవనంలోని మూడు గదుల్లో ఎంపీడీవో సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా.. ఒక హాలును సమావేశాలకు కేటాయించారు. మరో రెండు గదుల్లో మండల వ్యవసాయ, ఎంపీపీ కార్యాలయం ఉంది. ఈ భవనం పైపెచ్చులు ఊపి పడుతుండడంతో విధులు నిర్వర్తించేందుకు సిబ్బంది వెనుకంజవేస్తున్నారు. గతంలో పలుమార్లు సిబ్బంది తలలపై పెచ్చులు పడటంతో చిన్నపాటి గాయాలతో బయటపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఎంపీడీవో కార్యాలయం కారిపోయి నీటితో నిండిపోతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేసి ఇదే ప్రాంతంలో నూతన భవనం నిర్మాణానికి రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు పంపించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

నిరుపయోగంగా వెలుగు, ఐసీడీఎస్ భవనాలు

ఎంపీడీవో కార్యాలయం ప్రాంతంలో 2000వ సంవత్సరంలో ఉపాధి నిధులు సుమారు రూ. 32 లక్షలతో వెలుగు భవనాన్ని నిర్మించారు. తర్వాత ఉపాధి, వెలుగు కార్యాలయాల కోసం అదనంగా మరో భవనం నిర్మించారు. దీంతో వెలుగు సిబ్బంది నూతన భవనంలోకి వెళ్లిపోవడంతో గత పదేళ్ల నుంచి వెలుగు భవనం ముళ్ల పొదల్లో నిరుపయోగంగా ఉంది. ఇదే ప్రాంతంలో 2017లో రూరల్, అర్బన్ ఐసీడీఎస్ కేంద్రాలను ఒక్కోదాన్ని రూ.53 లక్షల చొప్పున నిర్మించారు. ఇప్పుడు రూరల్ కేంద్రంలోకి అర్బన్ కేంద్రం అనుసంధానం చేయడంతో అర్బన్ ఐసీడీఎస్ భవనం ప్రారంభానికి సైతం నోచుకోలేదు. ఇది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. లక్షలాది రూపాయల విలువైన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. శిథిలావస్థలో, ఇరుకు గదుల్లో ఎంపీడీవో, వ్యవసాయ సిబ్బంది పని చేసే బదులు నిరుపయోగంగా ఉన్న భవనాల్లోకి మార్పుచేస్తే మేలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పైరెండు భవనాలు తమకు దక్కాలంటే జెడ్పీ సీఈఓ, ఐసీడీఎస్ పీడీల అనుమతులు ఉండాలని ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్ చెప్పారు.



శిథిలావస్థకు చేరుకున్న ఎంపీడీఓ కార్యాలయం



కార్యాలయం పైపెచ్చులు ఊడిపోయిన దృశ్యం



ఇరుకు గదిలో విధులు నిర్వర్తిస్తున్న వ్యవసాయాధికారి భార్గవి



ముళ్ల పొదలు మధ్య నిరుపయోగంగా ఉన్న వెలుగు కార్యాలయం



నిరుపయోగంగా ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం

హెల్మెట్‌ను విధిగా వినియోగించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సోంపేట: యువత ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సంస్కారభారతి డిగ్రీ కళాశాలలో వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తూ న్యాయవిజ్ఞాన సదస్సును మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.అనిల్‌తో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించక పోవడం వలన చాలా మంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాల్లో విషాదాన్ని మిగుల్చుతున్నారన్నారు. ఎంవీఐ అనిల్ మాటాడుతూ.. హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు సర్వేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు బి.కవిబాబు, బి.శ్రీరామమూర్తి, ఏవో వి.పాపారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ పరిశీలన



కాలువలో ఉన్న అడ్డంకులు తొలగిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: కొమరల్తాడ, కణితివూరు వద్ద వంశధార 60ఆర్ఎల్ కాలువను టీడీపీ నాయకులు మంగళవారం పరిశీలించారు. వంశధార నీరు మరింత వేగంగా శివారు ప్రాంతాలైన పొల్లాడ, కొమరల్తాడ, సూర్యమణిపురం మంత్రిపాడు, బావనపాడు ప్రాంతాలకు తరలించేందుకు కాలువలో ఉన్న పొదలను తొలగొస్తున్నట్లు నాయకులు చెప్పారు. పనులు దాదాపు పూర్తయినందున రెండు రోజుల్లో వంశధార జలాలు రైతులకు అందుతాయన్నారు. పరిశీలనలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గోవింద పాపారావు, మాజీ సర్పంచ్‌లు దుర్రి నారాయణస్వామి, ఎ.రఘుపతిరావు, గాడి అఖిల్, కె.అప్పారావు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రికి వినతి



: కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కంచిలి: తమ గ్రామంలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని బూరగాం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును శ్రీకాకుళంలోని కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. బూరగాం జాతీయ రహదారి వద్ద అండర్‌పాస్, జాతీయ రహదారి నుంచి రైల్వేగేట్ వరకు సీసీ రహదారి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కూటమి నాయకులు బొడ్డు అప్పారావు, బద్రి నాగేష్, బద్రి డిల్లీరావు, రాపాక బాలరాజు, బొట్టా కొదండరావు, కొరికాన నెహ్రూ, తలగాన వాసు ఉన్నారు.

'నిధుల మళ్లింపు సబబు కాదు'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, బీఎంసీయూ, లైబ్రరీలకు సంబంధించి పూర్తిస్థాయిలో భవనాలు నిర్మించలేదని.. అలాంటప్పుడు నిధులు మళ్లించడం ఎంతవరకు సబబు అని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ప్రశ్నించారు. రామయ్యపుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ జేఈలతో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గంలో ఇంతవరకు ఒక్క డిజిటల్ లైబ్రరీ కూడా నిర్మించలేదని అన్నారు. పూర్తిస్థాయిలో నిధులు మళ్లించడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని అన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ రామారావు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు దంపతులు

కవిటి: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించినట్లు రామారావు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ నర్తు చామంతి ఉన్నారు.

ఏపీఎంపై ఫిర్యాదు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కేశుపురం సీఎఫ్ ఎంపికలో స్థానిక ఏపీఎం సనపల ప్రసాదరావు కొంత మందితో కుమ్మక్కై తనకు అన్యాయం చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అయ్యప్ప స్వయం శక్తి సంఘం అధ్యక్షురాలు పిలక గౌతమి కోరారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ కిరణ్‌కుమార్‌ను మంగళవారం ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న సీఎఫ్ లక్ష్మీకాంతాన్ని తొలగించకుండానే కొంత మందిని ప్రలోభపెట్టి ఏకపక్షంగా తనకు అనుకూలంగా ఉన్న వ్యక్తిని సీఎఫ్‌గా ఎంపిక చేశారని, ఆ ఎంపికను రద్దు చేసి స్వయం శక్తి సంఘాల మహిళల సమక్షంలో మరోమారు ఎంపిక చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

పాఠశాల సందర్శన



వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

కవిటి: రాజపురం ఆదర్శ పాఠశాలను ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ



లబ్ధిదారులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడో వార్డు చినబడం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార కిట్లను లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. బాలింతలు, గర్భిణులకు సంబంధించిన కిట్లను స్థానిక నాయకుడు బడ్డ నాగరాజు చేతులమీదుగా పంపిణీ చేశారు.

ప్రగడపుట్టుగలో పారిశుధ్య పనులు

కవిటి: కవిటి మేజర్ పంచాయతీ పరిధి ప్రగడపుట్టుగ గ్రామంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య పనులను మంగళవారం చేపట్టారు. ఐదుగురు జ్వరాలతో మంచం పట్టడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫాగింగ్ చేయడంతో పాటు వీధుల్లో చెత్తచెదారాలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు.

మండపల్లిలో..

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి గ్రామంలో కూడా పారిశుధ్య పనులను చేపట్టారు. కాలువల్లో పూడికలు తొలగించారు. వీధులు, నీటి వనరుల వద్ద బ్లీచింగ్ చేయించారు. పనులను సర్పంచ్ పిట్ట శశిరేఖ, వైఎస్సార్‌సీపీ నాయకుడు పిట్ట మామయ్యరెడ్డి పర్యవేక్షించారు.

ఇంటి తొలగింపునకు యత్నం!



ఆవేదన వ్యక్తం చేస్తున్న నాగమ్మ

కాశీబుగ్గ: మున్సిపాలిటీ శివాజీనగర్‌లో అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంటిని తొలగించేందుకు అధికారులు ప్రయత్నం చేశారు. తాను పనికి వెళ్లిన సమయంలో పలాస రెవెన్యూ అధికారి నిరంజన్ సిబ్బందితో కలిసి జేసీబీతో ఇంటి ముందు భాగాన్ని తొలగించారని దళిత మహిళ మినమింటి నాగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలోనే అప్పుచేసి చిన్న ఇంటిని నిర్మించుకుని జీవిస్తున్నామని.. తమలాంటి వారిపై రాజకీయ కక్షతో తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసి కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించింది. అధికారులకు, బాధితురాలకు మధ్య వాగ్వాదం పెరగడంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.

'ఆ ఘటనతో తమకు సంబంధం లేదు'



మాట్లాడుతున్న మందస టీడీపీ నాయకులు

కాశీబుగ్గ: మందస మండలం హరిపురం గ్రామంలో ఎలక్ట్రిల్ దుకాణం దగ్ధమైన సంఘటనతో తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. హరిపురంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఘటన జరగడంపై విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఈ ఘటన వెనుక తమ పార్టీ నాయకుల హస్తం ఉందని నిందనలు వేయడం తగదన్నారు. ఎలక్ట్రికల్ దుకాణంలో సీసీ కెమెరాలు పని చేయక పోవడంతో ఈ సంఘటనపై పలు అనుమానాలు ఉన్నాయని.. కావున పోలీసులు విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షులు భావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, హరిపురం టీడీపీ అధ్యక్షుడు బైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసుదేవరావు, కోట్ర రామారావు, బీజేపీ జిల్లా కార్యదర్శి రౌతు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు విక్రయ కౌంటర్ ప్రారంభం



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న భరత్ నాయక్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పాతజాతీయ రహదారిలో సబ్సిడీపై కందిపప్పు విక్రయ ప్రత్యేక కౌంటర్‌ను పలాస ఆర్డీలో భరత్ నాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో కందిపప్పును 195 రూపాయలకు పైగా విక్రయిస్తున్నారన్నారు. దీంతో ప్రభుత్వం చర్యలు తీసుకొని ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి కిలో రూ. 160 చొప్పున విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కౌంటలర్ మరో మూడు రోజులు మాత్రమే పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సేనాపతి రవికుమార్, ఇతర అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



పనులు ప్రాంభిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం పంచాయతీ గూనాలపాడు గ్రామంలో ఉపాధి పనులను టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ మంగళవారం ప్రారంభించారు. గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వలస పోకుండా స్థానిక ఊర చెరువులో పనులు కల్పిస్తున్నట్టు చెప్పారు. వేతనదారులు పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పి.ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ సీపాన గోపి, పి.వేణు గోపాలరావు, ఉప సర్పంచ్ గుంట సత్యం, ఎం.నారాయణరావు ఉన్నారు.

కిడ్నీ రోగికి రూ. 40 వేల ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్:



సాయాన్ని అందజేస్తున్న యువజన సంఘం సభ్యులు

కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న రోగికి పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందజేసి పెద్ద మనస్సు చాటుకున్నారు యువకులు. వివరాలలోకి వెళితే.. మండలంలోని బూర్జపాడు గ్రామానికి చెందిన రత్నాల దీనా చౌదరి మూత్రపండాల వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటోంది. అసలే పేదరికంతో బాధపడుతున్న ఆమె ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న స్థానిక రాధాకృష్ణ యువజన సంఘం సభ్యులు చందాలు రూపేణా రూ. 40 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని ఆమె భర్త హరిశ్చంద్ర చౌదరికి మంగళవారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్:

ఈ నెల ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కొళిగాం పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ వై.కల్యాణి అన్నారు. ఇందులో భాగంగా తమసిబ్బంది ఇంటింటికీ వెళ్లి డయేరియా నివారణపై అవగాహ కల్పిస్తున్నట్టు చెప్పారు. అలాగే చిన్నారులు అతిసారం వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లను అందజేస్తున్నట్టు చెప్పారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

గంగువాడ చేరిన వంశధార నీరు



గంగువాడ గ్రామం వద్ద ప్రవాహిస్తున్న వంశధార నీరు

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ గంగువాడ గ్రామ సమీపానికి మంగళవారం వంశధార నీరు వచ్చి చేరింది. గెడ్డలు ఎండిపోయి ఉన్నప్పటికీ ఇదివరకు నిర్మించిన నీటివంతెనలపై సాగునీరు పంటపొలాలకు చేరుస్తున్నారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి చెరువులు, కాలువలు వంశధార నీటితో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే వెదలు వేసిన రైతులకు అనుకూలంగా ఉన్నప్పటికీ నాట్లు వేయడానికి అవసరమైన నారు పెరగకపోవడంతో రైతులు వేసి చూస్తున్నారు. ఇప్పుడు వంశధార నీరు చేరడంతో ఖరీఫ్ పనులు ముమ్మరం కానున్నాయి.

స్వేచ్ఛావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారికి ఆషాఢమాసం మొదటి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తైలమర్దనం, సిందూరమర్దన, పసుపు, కుంకుమ, వివిధ రకాల పళ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.